క్లుప్తంగా

ఇంటర్‌లో ప్రవేశానికి స్పాట్ అడ్మిషన్స్

ధరూరు: గూడెందొడ్డి గ్రామశివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల 28న స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ సురేఖ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మొత్తం ఎంపీసీకి సంబంధించి ఎస్సీ-4, ఎస్టీ-2, బీసీ-3, బీసీ సీ-1, బైపీసీకి బీసీ-1తో కలిపి మొత్తం 13 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు సర్టిఫికెట్లతో హాజరు కావాలని, ఎస్ఎస్‌సీ మెరిట్ ఆధారంగా ఎంపికలు ఉంటాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

లెప్రసీపై సర్వే



రాజోళి: మండలంలోని తూర్పు గార్లపాడులో శుక్రవారం లెప్రసీ సర్వే నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికెళ్లి వ్యాధి లక్షణాలు ఉన్న వివరాలను నమోదు చేసుకున్నారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జయప్రకాష్, రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

అలంపూర్‌వాసికి డాక్టరేట్



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ బోరవెల్లికి చెందిన కే.నర్సింహులుకు అన్నమలై యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. నంద్యాల ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్న నర్సింహులు.. 'డెవలప్ ఎక్స్‌టెన్సివ్ అప్రోచెస్ ఆఫ్ టాపిక్ మాడల్స్ ఫర్ ఎఫెక్టివ్ సోషల్ హెల్త్ క్లస్టర్ టెండన్సీ ఎసెస్‌మెంట్' అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా అతడి మిత్రులు దిండిగల్ ఆనంద్‌శర్మ,, నరసింహారావు, శ్రీరాములు, తిక్కయ్య, రామకృష్ణ, నారాయణ, రంగనాయకులు, జుబేర్, సమీర్, జితేందర్, ముషీర్ అభినందనలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మెలగాలి



కేటీదొడ్డి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనతో మెలగాలని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవాసమితి మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్ఐ వెంకటేష్‌కు భగవద్గీత ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరుల గ్రంథాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భగవద్గీతలోని శ్లోకాల భావాలను వివరించారు. ఆగస్టు 13న కృష్ణాష్టమి సందర్భంగా ఊరేగింపు నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రసాద్ పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలి

గద్వాల అర్బన్: సెకండ్ ఏఎన్ఎంలను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రంగన్న అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో పదో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఆకాంక్షలకు విరుద్ధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. స్వార్థపూరిత విధానాలను అవలంబించడం సరికాదని తెలిపారు.

మోటార్ చోరీ

మానవపాడు: మండలంలోని గోలకుపాడుకు చెందిన రైతు అశోక్‌కుమార్ వ్యవసాయ పొలంలో శుక్రవారం మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్ఐ రాము తెలిపారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థినికి సన్మానం



పెబ్బేరు రూరల్: నీట్‌లో ర్యాంక్ సాధించి వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు పొందిన శ్రీరంగాపురం మండల కేంద్రం అంబేడ్కర్ కాలనీకి చెందిన నర్మదను శుక్రవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, చెన్నరాములు సన్మానించారు. వైద్యవిద్యలో రాణించి పేదలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, ఎల్లస్వామి, రమేష్, ధర్మ, సుమన్‌యాదవ్, రాజు, నాగరాల దయాకర్, బీసన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజలు



గద్వాల కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

గద్వాల: శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో లక్ష్మీపూజలు చేశారు. పలు ఆలయాల్లో మహిళలు సామూహికంగా వరలక్ష్మి వ్రతం ఆచరించగా, ఇళ్లలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి, మార్కెండేయస్వామి, కాళికాదేవి, అయ్యప్పస్వామి, కోటలోని చెన్నకేశవస్వామి, నల్లకుంట శివాలయం, రాఘవేంద్ర కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కుంకుమార్చన నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సుగంధ ద్రవ్యాలతో కూడిన వట్టివేర్లతో అలంకరించారు. పాఠశాలల్లో సైతం వరలక్ష్మి వత్రాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సరస్వతీ శిశుమందిరం, ఎస్ఆర్ విద్యానికేతన్‌లో వరలక్ష్మి వత్రాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రాజోళి: మండలంలోని పలు గ్రామాల్లో వరలక్ష్మి వ్రతం ఆచరించారు. మండల కేంద్రంలోని అంభా భవానిమాత ఆలయంలో మహిళలు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు మహిళలతో వరలక్ష్మీవ్రతం చేయించారు.

ఉండవెల్లి: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో లక్ష్మీ పూజలు చేశారు. వరలక్ష్మి వ్రతాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.

కేటీదొడ్డి: మండలంలోని కేటీదొడ్డి, కొండాపురం, గువ్వలదిన్నె, ఇర్కిచేడ్, నందిన్నె, కుచినెర్ల తదితర గ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ఆలయాల్లో సామూహికంగా వ్రతాలు నిర్వహించగా, ఇళ్లలో లక్ష్మీపూజలు చేశారు.



ఉండవెల్లిలో..

అయిజ: మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో వరలక్ష్మి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య మహిళలు సామూహికంగా వరలక్ష్మి వ్రతం ఆచరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళామండలి అధ్యక్షురాలు మాలే శ్రీదేవి, చిలుకూరి రాధిక తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతం ఆచరించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.



రాజోళిలో వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు



అయిజలో వరలక్ష్మీవత్రం ఆచరిస్తున్న మహిళలు

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదాం



బీజేపీలో చేరిన వారితో డీకే అరుణ

గద్వాల: కేసీఆర్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కలిసికట్టుగా పోరాడుదామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పిలుపునిచ్చారు. ధరూరు మండలం పారుచర్ల, సోంపురం గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గడ్డం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల అరెస్ట్

గట్టు: కలెక్టరేట్ల ముట్టడికి బీజేపీ అధిష్టానం పిలుపునిచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు బల్గెర శివారెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రాజప్ప, ప్రధానకార్యదర్శి నాగప్ప, నాగయ్య, నర్సింహులు, చిట్టెయ్య, ఆంజనేయులు, లక్ష్మన్న, మూర్తి, ఆంజనేయులు, సలీం, రాములను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

శాంతినగర్: వడ్డేపల్లి మండల బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో మున్సిపాలిటీ అధ్యక్షుడు రామకృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శి పైపాడ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు మోహన్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

సెప్టెంబర్ 6న సన్నాహక సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్

అయిజ: ఎస్సీ వర్గీకరణ సాధనకు హైదరాబాద్‌లో తలపెట్టిన విశ్వరూప మహాసభకు సంబంధించి సెప్టెంబర్ 6న గద్వాలలో సన్నాహక సదస్సు నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ విజయ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూప మహాసభకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ హాజరవుతారని తెలిపారు. సభను జయప్రదం చేసేందుకుగానూ సన్నాహక సదస్సు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు గద్వాల శంకర్ ఆధ్వర్యంలో గంజిపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సురవరం ప్రతాప్‌రెడ్డికి ఘననివాళి

ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడులో సాహితీవేత్త సురవరం ప్రతాప్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురవరం లోకేశ్వర్‌రెడ్డి, వైస్ఎంపీపీ దేవన్న, మహేశ్వర్‌రెడ్డి, హరిశ్చంద్రారెడ్డి, రామకృష్ణ, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



సురవరం విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఎమ్మెల్యేకు సన్మానం



అలంపూర్: నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు శుక్రవారం అలంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే అబ్రహంను కలిసి సన్మానించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా అబ్రహంను ప్రకటించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎర్రవల్లి మండల సాధన సమితి, హోలియా దాసరి సంఘం నాయకులు, రాజోళి మండలం పెద్దదన్వాడ, అలంపూర్ మండలం క్యాతూర్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అయిజ: మండలంలోని వేణిసోంపురం, ఈడుగోనిపల్లి గ్రామాల్లో శుక్రవారం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 86 పశువులకు టీకాలు వేసినట్లు సిబ్బంది తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ టికెట్‌కు దరఖాస్తు



గద్వాల రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కోసం డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం గాంధీభవన్‌కు చేరుకొని ఇన్‌చార్జ్ మహేష్‌గౌడ్‌కు దరఖాస్తు అందజేశారు.

గుణపాఠం చెప్తాం

పెబ్బేరు రూరల్: ముదిరాజులకు బీఆర్ఎస్ నుంచి ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా కేటాయించకుండా మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల కార్యదర్శి సహదేవుడు శుక్రవారం ప్రకటనలో మండిపడ్డారు. ముదిరాజులను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముదిరాజుల ఓటు బీఆర్ఎస్‌కు పడకుండా గుణపాఠం చెబుతామని పేర్కొన్నారు.

పథకాలు బీఆర్ఎస్ నాయకులకేనా ?



సమావేశంలో మాట్లాడుతున్న షేక్షావలి ఆచారి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే పూర్తిస్థాయిలో అందుతున్నాయని, ఇతరులు వ్యయప్రయాసాలకు గురికావాల్సి వస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి షేక్షావలి ఆచారి అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు, బీసీబంధు, మైనార్టీ, గృహలక్ష్మి పథకాలను పొందేందుకు సామాన్య ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరిగి ఇబ్బందులకు గురయ్యారన్నారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు గడువు విధించడం వల్ల పేదలకు నష్టం చేకూరుతోందన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో సుమారు 2వేల దళిత కుటుంబాలు ఉంటే, కేవలం 20మందికి మాత్రమే దళితబంధు ఇచ్చారని తెలిపారు. బీసీబంధు కోసం వెయ్యి దరఖాస్తులు వస్తే.. కేవలం 29మంది లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేశారన్నారు. లబ్ధిదారుల్లో ఎక్కువ శాతం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలే ఉన్నారని విమర్శించారు. అర్హులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీసీసీ ఉపాధ్యక్షుడు గిత్తల దేవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శులు సాంబశివుడు, హనుమన్న, మండల అధ్యక్షుడు జయన్న, పట్టణ అధ్యక్షుడు మధుకుమార్, బీసీసెల్ ఉపాధ్యక్షుడు పాండురంగ ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు ఉండొద్దు



అలంపూర్‌లో మాట్లాడుతున్న తహసీల్దార్



గట్టులో..

అలంపూర్: ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వొద్దని తహసీల్దార్ మంజుల అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఓటర్ల సవరణలో సమన్వయంతో పని చేయాలన్నారు. ఓటర్ల నమోదుకు ఈనెల 26, 27, సెప్టెంబర్ 2, 9 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు.

గట్టు: ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రవికుమార్ బీఎల్‌ఓలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులను ఫాం-8తో చేపట్టాలన్నారు. చనిపోయిన ఓటర్ల పేర్లను నిబంధనల మేరకు జాబితా నుంచి తొలగించాలని సూచించారు. సమావేశంలో సీనియర్ అసిస్టెంట్ తిరుమల్లేష్, ఆర్ఐలు కరీం, శ్రీనివాసులు, గణాంక అధికారి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి



మృతదేహంతో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం కొండేరుకు చెందిన మంగళి ఈశ్వర్ గురువారం జింకలపల్లి సమీపంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఎస్ఎస్ఎస్ స్టాచ్ కంపెనీకి వరిపొట్టు సరఫరా చేస్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్త కారణంగానే ఈశ్వర్ దుర్మరణం చెందాడని కుటుంబసభ్యులు, గ్రామస్తులు శుక్రవారం మృతదేహంతో కంపెనీ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా నిండుప్రాణం బలైపోయిందని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామ నాయకుడు శ్రీధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐ రాజు పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈరన్న, ఎంపీటీసీ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో రాజకీయాలకు తావు లేదు



లబ్ధిదారుకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తిటౌన్: పేదరిక నిర్మూలనలో భాగంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో రాజకీయాలకు తావులేకుండా పని చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రూ.3.95 కోట్ల విలువైన బీసీబంధు చెక్కులు, 361 మంది దివ్యాంగులకు పెంచిన పింఛన్ రూ.4,016 ప్రొసీడింగ్ కాపీలను కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, రాష్ట్ర సహకార సంస్థల చైర్మన్ రాజాప్రసాద్‌రావుతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తులకు అండగా, సామాన్యులకు తోడుగా నిలవాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. కులవృత్తిదారులకు ఆర్థిక చేయూతనివ్వడంతో మరింత బలపడతారనే ఉద్దేశంతో బీసీబంధు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. దశల వారీగా అర్హులందరికీ సాయం అందిస్తామని వివరించారు. వ్యవసాయరంగం అభివృద్ధి చెందితే అనేక పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. దివ్యాంగుల పింఛన్ రూ.4,016 పెంచడంతో జిల్లాలోన 6,551 మందికి లబ్ధి చేకూరనున్నట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం దళిత, బీసీ, మైనార్టీబంధు పథకాలతో పేదలకు ఆసరాగా నిలుస్తుందని, ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేస్తోందని.. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పారదర్శకంగా కేసుల విచారణ



కేసుల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ ఆనంద్‌రెడ్డి

ఆత్మకూర్: పోలీస్‌స్టేషన్లలో నమోదైన ప్రతి కేసును పారదర్శకంగా విచారించి నిందితులకు శిక్ష పడేలా చూడాలని డీఎస్పీ ఆనంద్‌రెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఠాణాను సందర్శించి రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బాధితులకు న్యాయం జరిగేలా పని తీరు ఉండాలని సూచించారు. న్యాయాధికారుల వద్ద సమన్వయం పాటిస్తూ న్యాయస్థానం నుంచి త్వరగా తీర్పు వెలువడేలా చూడాలన్నారు. మిస్సింగ్ కేసులపై దృష్టి సారించాలని, దర్పన్ యాప్‌ను వినియోగించాని కోరారు. నిత్యం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని.. వాహన తనిఖీలు చేపట్టి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు పనిచేసేలా చూసుకోవాలని, నేరాలు జరిగే, శాంతిభద్రతలకు విఘాతం కలిగే ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ఫిర్యాదుదారులకు సత్వర్వ న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట సీఐ కేఎస్ రత్నం, ఎస్ఐ నరేందర్ ఉన్నారు.

ఒకవైపు సమ్మతి.. మరోవైపు అసమ్మతి

● ఎమ్మెల్యే అబ్రహం అభ్యర్థిత్వంపై బీఆర్ఎస్‌లో లొల్లి



అబ్రహంకు అనుకూలంగా నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నరసింహారెడ్డి ఇంట్లో సమావేశమైన అబ్రహం వ్యతిరేకవర్గం

అయిజ: అలంపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే అబ్రహంను ఖరారు చేయడంపై అధికార పార్టీలో లొల్లి చోటుచేసుకుంటోంది. అబ్రహం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు కొందరు బీఆర్ఎస్ నాయకులు బాహాటంగా ప్రకటిస్తున్నారు. శుక్రవారం పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఎక్లాస్‌పురం నరసింహారెడ్డి నివాసంలో వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్రహం అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఆయన నాయకత్వంలో పని చేయలేమని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో అబ్రహంకు ఓట్లు వేసే ప్రసక్తేలేదని తేల్చిచెప్పారు. నాలుగేళ్లగా ఆయన ప్రవర్తన సరిగా లేకపోవడం, ఒంటెద్దు పోకడతో ప్రజలు, నాయకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆయన చేసే పనుల వల్ల అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి కుంటు పడుతుందని, అబ్రహంకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని నిర్ణయం తీసుకున్నారు.

మరోవైపు బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ నాయకుడు సంకాపురం రాముడు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అబ్రహంకు అనుకూలంగా నినాదాలు చేశారు. అబ్రహం అభ్యర్థిత్వాన్ని స్వాగతిస్తున్నామని, ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు.